శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!

# గురుకృప

మూలానికి మూలం

## శ్రీసాయి అనుగ్రహ వాహకం

## సమున్నత వ్యక్తిత్వం
## సంచరించిన పరిపూర్ణ సాయితత్త్వం



"మీ సోర్స్ ఆఫ్
థాట్ కన్నా లోతులో
నేనున్నాను"

సాయినాథుని శరత్‌బాబు

జన్మదిన సంచిక



తలచిన వారి హృదయాలలో ఆరని మంటలనార్పి, తీయని ప్రేమను కురిపే నామం
సాయినామం. ప్రతిఫలమెరుగని ఆయన జీవితం పరిపూర్ణ జీవితానికి ప్రతీక.
అలౌకికమైన నిష్ట, కఠినతరమైన నియమాలతో సాగిన ఆయన జీవితం
అనుసరణీయమే కాదు, నిత్యానుస్మరణీయం. ఆయన కరుణ, కోపం-
ఫలితం దృష్ట్యా చూస్తే ఆయన భక్తుల శ్రేయస్సు పట్ల ఆయనకున్న శ్రద్ధకు నిదర్శనం,
నిరూపణం. అందుకే సాయిభక్తులకు **శ్రీసాయి** అంటే పరిపూర్ణమైన దివ్యత్వం -
ధరించిన మానుషరూపం.

వేరు వేరు జన్మలలో రకరకాల మార్గాల్లో దైవం కోసం అన్వేషిస్తూ వృధా పరచుకున్న
జీవితాలపై దయతలచి కరుణతో దరి చేర్చుకున్న మహోన్నత తత్త్వం, యావత్ప్రపంచం
ఆరాధిస్తున్న సద్గురు స్వరూపం - **శ్రీసాయినాధుడే**



సంపుటి : 15
సంచిక : 2

జన్మదినసంచిక
01-01-2012

# గురుకృప



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

- శ్రీబాబూజీ



లోపలి పేజీలలో

ఆధ్యాత్మికత 4
- గురుకృప

ప్రేమించు ప్రేమకై 5
- శరచ్ఛంద్రికలు

నమస్కారం 10
- శరచ్ఛంద్రికలు

సబ్‌కా మాలిక్ ఏక్ 14
- శరత్ అరుణాచల

జ్ఞాన రత్నాలు 15
- గురుకృప

లేదు శక్తి... నిన్ను ఎరిగేటి యుక్తి 21
- రమేష్

నిర్వహణ : ***గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు***

GURUKRUPA, 2-1-6, Gandhi Chowk, Tenali-01.
Ph : 93933 61778
Printed at : Ramakrishna Printers, Visakhapatnam.



# ఆధ్యాత్మికత

ఆధ్యాత్మికత అంటే ఏమిటి? మనం చేసే పూజలు, వ్రతాలు, ఇత్యాది క్రతువులా? లేక నామజపం, సంకీర్తన, భజన.... ఇలా ఏది నిజమైన ఆధ్యాత్మికత.... ఇవన్నీ కూడా ఆధ్యాత్మికతే! కానరీ ఇవి మాత్రమే ఆధ్యాత్మికత కాదు. పూజ్య గురుదేవుల మాటల్లో చెప్పాలంటే ఆధ్యాత్మికత అంటే ఆనందంగా జీవించడమే. మహాత్ములు ఏమన్నారంటే మానవుడు వేదవిహితంగా జీవించాలన్నీరు. ఆ వేదవేద్యునికై పరితపించాలన్నారు. వేదవిహితంగా అంటే భగవంతునికి ప్రీతిపాత్రంగా జీవించడం అని అర్థం. శ్రీసాయి ఏమన్నారంటే "ఆకలిగొన్నవారికి ఆహారం, దాహార్తికి నీరు, బట్ట లేనివారికి బట్టలు ఇవ్వు. అట్లా ఇచ్చేవారు నాకెంతో ప్రీతిపాత్రులు" అని.

శ్రీసాయి సృజించిన 84 లక్షల జీవరాశుల్లో మనమూ ఒకరమని తెలుసుకోవడమే –వేదవిహితం. ముఖ్యంగా ఆయన సృష్టిలో, దృష్టిలో మిగిలిన అన్ని జీవరాసులకంటే మనం ఒక్కరమే అధికమో, ప్రత్యేకమో, ప్రీతిపాత్రమో కాదనే విషయం తెలుసుకోవడమే–వేదవిహితం. ప్రపంచాన్ని ప్రపంచంగా సాగనివ్వడమే – వేదవిహితం. అలాంటి జీవితాన్ని జీవించడమే, ఆ సంస్కృతిని జీవితంలోనికి ఆహ్వానించడమే ఆధ్యాత్మికత. ఇది మనకు మహాత్ములజీవన విధానంలో ద్యోతకమవుతుంది. పాముని పాకనివ్వడం, పక్షిని ఎగురనివ్వడం, చేపను ఈదనివ్వడం, వాటి సొంత, సహజ, ధార్మిక హక్కులను కాలరాయకుండా ఉండటమే ఆధ్యాత్మికత. కాని మనం అలా వుంటున్నామా? ఉండనిస్తున్నామా? భూమిని ఆక్రమించుకున్నాం, అడవులు నరికేస్తున్నాం. పుట్టలు తవ్వేశాం. ఆకాశాన్ని ఆక్రమించుకున్నాం, కాలుష్యంతో పొగమేఘాలు సృష్టిస్తున్నాం. కృత్రిమ వర్షాలకోసం, రసాయనం గుమ్మరిస్తున్నాం, ప్రతి చోటును పాలిథీన్‌తో నింపేస్తున్నాం. చెట్లను కొట్టేస్తున్నాం, చెట్లను పెరగనివ్వడం లేదు, పెంచడం లేదు. నదులు, సముద్రాలు అన్నింటిని మురుగు కాల్వలు చేసేసాం. పాపం కళ్లు మూయడం కూడా రాని అమాయకపు చేపలు కళ్లు తెరచుకొనే కళ్లు మూస్తున్నాయి (చనిపోతున్నాయి). ఇంత మానవతా విహీనంగా జీవిస్తూ వేదాలు వల్లె వేసినంత మాత్రాన వేదవిహిత జీవనం అవుతుందా? వ్రతాలు, పూజలు, నోములు ఆచరించినంత మాత్రాన ఆధ్యాత్మికత సొంత మవుతుందా? వేదాలు సదా శిరోధార్యాలు. వేదవిహిత జీవితం సదా ఆచరణీయం, ఆరాధనీయం. ఓ పిల్లవాడు తప్పిపోతే, దారి తప్పితే ఆ పిల్లవాడిని వాళ్లింటికి చేర్చే ప్రయత్నం ఎలా చేస్తామో, అట్లే ఓ పాము దారితప్పి వచ్చింది జనంలోకి, ఇంట్లోకి. ఇక్కడ మహాత్ముని విధానం ఎలా వుంది? గమనించుకోవాలి. ఓసారి భరద్వాజగారు తమ ఇంట్లోకి వచ్చిన పాముని, పాములు పట్టే వాడిని తీసుకొచ్చి, దాన్ని పట్టి అది వుండే చోట విడిపించడం. భక్తుని జీవన విధానం ఎలా వుందో చూద్దాం. బాలాజీ పాటిల్ పశువులకొట్టంలోకి వచ్చిన పాముని బాబాగా తలచి, పాలు నివేదన పెట్టి ప్రార్థించిన వైనం. ఇలా జీవితాన్ని రమణీయం, ఆదరణీయం, తేజోమయం, ఆరాధనీయం చేసే ఉత్తమోత్తమ మానవీయ లక్షణాలను కోల్పోవడం సబబేనా!

సహజంగా, ధర్మానుసారంగా, కర్తవ్యానుసారంగా, నియమానుసారంగా జీవించడమే ఆధ్యాత్మికత. ముక్తిపథం అంటే అందర్నీ వెనక్కు తోసేసి మనం ముందుకు వెళ్లిపోవడం కాదు. ముందున్న ముళ్లదారిని మనం శుభ్రం చేసుకుంటూ, మన వెనుక వారికి ప్రక్కన చోటివ్వడం, వీలైతే మనకంటే ముందుకు వెళ్లే అవకాశాన్నివ్వడం. వారి అభివృద్ధిని, ఆనందాన్ని కాంక్షించడం, ఆస్వాదించడం (శ్రీసాయిని చేరుకోవడానికి చివరిమెట్టుగా వుంటాను) ఏ అంశాన్నయినా సహృదయంతో ముఖ్యంగా సదుద్దేశ్యంతో స్వీకరించాలి. పక్షుల్ని పంజరంలో బంధించి పళ్లు పెట్టడం, పాముల్ని బుట్టలో పెట్టి తిండిపెట్టడం, చేపల్ని ఆక్వేరియంలో పెట్టి మేత పెట్టడం, ఇదికూడా ఆధ్యాత్మికత అనుకుంటే ఎవరూ ఏమీ చేయలేరు. ప్రకృతిలో మనం మమేకం అవ్వడం, మనలోని ప్రకృతిని ఆవాహన చేసుకోవడం ఆధ్యాత్మికత. తన జీవితంలోకి సహజత్వాన్ని ఆహ్వానించాలి. ఆవాహన చేసుకోవాలి. ప్రకృతిలోని సహజత్వాన్ని సాగనివ్వాలి, ఆడనివ్వాలి, పాడనివ్వాలి, ఎగరనివ్వాలి, నవ్వనివ్వాలి.

ప్రకృతి – నవ్వుతుంది. ఎగిరే పక్షిలా, విరిసే పువ్వులా, పాకే చీమలా, ప్రవహించే జలంలా, అందంగా, ఆనందంగా, హాయిగా, స్వేచ్ఛగా.......... మనం ప్రకృతితో మమేకమైతే మనముందు ఒక క్రొత్త జీవితం సాక్షాత్కరిస్తుంది, వెల్లివిరుస్తుంది. ఆధ్యాత్మిక భావం అంటే తింటున్నపుడు, త్రాగుతున్నపుడు, కూర్చున్నపుడు, నిద్రిస్తున్నపుడు, పని చేస్తున్నపుడు సర్వ వేళలా భగవత్ చింతన కలిగి వుండడం, నిరంతరం భగవంతుని స్మరించుకోవడాన్ని అలవరచుకోవాలి. “అందుకే సదా కొంతపాలు మనస్సును భగవంతునివైపుగా కేంద్రీకరించాలి” అనేవారు శ్రీరామకృష్ణులు.

## శరశ్చంద్రికలు

## ప్రేమించు ప్రేమకై - *నవంబర్ 2011*

**గురువుగారు :** ప్రేమ అనేది ఆనందం వుండటం వలన కలిగేటటువంటి అనుభవం. సాధారణంగా మనలో అటువంటి అనుభవాన్ని (ప్రేమను) కలిగించేదేదో మనం తెలుసుకున్నపుడు, ఆ అనుభవాన్ని కలిగించే దానిని (ఆ అనుభవానికి కారణమైన దానిని) మనం ప్రేమిస్తున్నామని చెప్తాము. అందరికీ (ప్రతి ఒక్కరికి) ఎప్పుడూ వాళ్లు కావాలనుకునేదేదో వుంటుంది. కానీ అది చాలా వరకు అవ్యక్తంగా, అస్పష్టంగా వుంటుంది. అది ఏమిటన్నది వారికి తెలియదు. మన జీవితం మొత్తం, అస్పష్టంగా ఉన్న పరిపూర్ణత్వ భావనను వాస్తవం చేసుకొని, తద్వారా పొందే నిజమైన ఆనందం కోసం మనం చేసే ప్రయత్నమే అవుతుంది. కొంతమందికి వారి జీవితంలో ఒక వ్యక్తి – “సద్గురువు” ఎదురైనపుడు అక్కడ





అటువంటి ప్రేమ కలుగుతుంది. అందుకు నీకు ఏ కారణమూ కనిపించదు. కానీ అది నీకు అనిర్వచనీయమైన భద్రతాభావాన్ని, నమ్మకాన్ని, ఆనందాన్ని కలిగిస్తుంది. నువ్వు ఇష్టాయిష్టాలు అని అనుకుంటూ ప్రోగు చేసుకున్నవన్నీ అక్కడ తమ అస్తిత్వాన్ని కోల్పోయి కనుమరుగవుతాయి. అలా కావడానికి కారణం ఆ ఇష్టాయిష్టాలన్నీ నెరవేరిపోయాయని కాదు : ఏదో జరుగుతుంది. ఆ అనుభవాన్ని అనుభూతి చెందడం, వ్యక్తపరచడం, విస్తృతం చేసుకోవడమే ప్రేమ!

**గురువుగారు :** మీరందరూ ప్రేమ కోసం పరితపిస్తూ వుంటారు. మీరు దానికి రకరాలపేర్లు పెడతారు – ముక్తి, మోక్షం, నిర్వాణం, బంధవిమోచనం, స్వేచ్ఛ... ఇలాంటివన్నీ. కానీ హృదయాంతరాళాలలో మీరు నిజంగా తపించేది మాత్రం ప్రేమను పొందాలని, ఎవరి ప్రేమనైనా నిజంగా పొందాలని! ఎప్పుడైతే ఒకరు నిజంగా నిన్ను ప్రేమిస్తున్నారు అనేటటువంటి అనుభవం కలుగుతుందో నీలో ప్రేమ కలగడం మొదలవుతుంది. అది జ్వలిస్తుంది. ప్రేమ జ్వలించిన తరువాత అది నిన్ను అంటుకొని పూర్తిగా ఆక్రమించి దహించి వేస్తుంది, ఎందుకంటే నీలో అస్పష్టంగా వుండే ఆనందానుభవమే అది కాబట్టి. ఎప్పుడూ నువ్వు దాని (ఆ ప్రేమకు) నిర్దిష్టమైన వ్యక్తీకరణ కోసం ప్రయత్నిస్తుంటావు. అందువల్ల ప్రేమ నిజంగా రగులుకున్నపుడు ఆ అనుభవానికి నిన్ను నువ్వు అర్పించుకుంటావు. కానీ ఈ రగులుకోవడం నీ చేతుల్లో లేదు: నిన్ను వేరెవరో ప్రేమించాలి; ఆ ప్రేమించే మనిషి మూర్తీభవించిన ప్రేమరూపమై వుండాలి; నిన్ను ప్రేమించగలిగి, నీలో ప్రేమను రగిలించగలసామర్థ్యం కలిగి వుండాలి. అలాంటి వారే సద్గురువు.

**భక్తుడు :** గురువుగారూ! బాబాకు కృతజ్ఞతలు ఎలా చెప్పగలం?

**గురువుగారు :** మనం ఆయనకు చెందినవారమనే బాంధవ్య భావనతో ఆయన ప్రేమను అనుభూతి చెందడమే నిజమైన కృతజ్ఞత. అవును, ఎవరో చెప్పినట్లు గుర్తు; "ఎవరికైనా వారిపట్ల శ్రద్ధను చూపించడం కన్నా ఇవ్వగలిగిన గొప్ప బహుమతి అంటూ ఏమీ వుండదు" అని. కాబట్టి బాబాకు మీ శ్రద్ధను ఇవ్వండి, అది ఆయనకు కృతజ్ఞత తెలియచేయడమే!

**భక్తుడు :** శంకరులు ఎక్కడో "శ్రద్ధే భక్తి" అని అన్నారు.

**గురువుగారు :** అవును, అది భక్తే. అందుకే దానిని నేను ప్రేమ అన్నాను. ప్రేమంటే ఏమిటి? భక్తి. భక్తి అంటే? శ్రద్ధ. శ్రద్ధ అంటే? జ్ఞానం.

**భక్తుడు :** గురువుగారూ! బాబా ఇప్పుడు తమ భౌతిక దేహంతో లేరు. కనుక మేము ఆయనను పట్టుకోవాలంటే కష్టం. అందువల్ల ఆయన భౌతిక దేహానికి అతీతంగా ఏదో విధంగా మేము ఆయనతో సంబంధం కలిగి వుండాలి. కేవలం గురువు భౌతిక రూపంతో మాత్రమే కాకుండా, అంతరంగంలో కూడా సంబంధం కలిగివుండటానికి మార్గాలున్నాయా?

**గురువుగారు :** నిజానికి ఇక్కడున్న వాళ్లంతా రకరకాల మార్గాలలో చేస్తున్నది అదే! వారి జీవితాలను బాబాతో శృతి చేసుకొని దానిని (ఆ సంబంధాన్ని) ఇంకా ఇంకా స్థిరం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. జీవితము యొక్క ప్రతి పార్శ్వంలో, ప్రతి అడుగులో, ప్రతి శ్వాసలో బాబాను అనుభూతి చెందడానికి ప్రయత్నిస్తున్నారు.

**భక్తుడు :** అది ఆంతరంగికమే అవుతుంది కదా!?

**గురువుగారు :** అది ఆంతరంగికమే. బాబాను అనుసరించడమనేది కూడా ఆంతరంగికమై వుండాలి. అది (ఆ అనుసరించడం) అంతరంగంలోని తపనకు బాహ్యమైన వ్యక్తీకరణ. నీకు లోపల ఆ భావం లేకుండా కేవలం బాహ్యంగా అనుసరిస్తున్నంత మాత్రాన ఏమీ ప్రయోజనం లేదు. అందుకే బాబానే అన్నారు "బాబా అంటే ఈ దేహమేనని అనుకుంటే నువ్వు నన్నసలు చూడనట్లే! నీ జీవితపర్యంతం నువ్వు నా ప్రక్కనున్నా ఉపయోగం లేదు" అని. అదీ ఆయన చెప్పింది. బాహ్యమైన అనుసరణ, అంతరంగికమైన తపనకు వ్యక్తీకరణ కావాలి; నేను ముందు చెప్పినట్లు మన ప్రేమకు వ్యక్తీకరణ.

**భక్తుడు :** గురువుగారూ! మీరు బాబాను పిలవడం అనేది హృదయంలో నుండి వస్తుంది అన్నారు. మేము బాబాను ఇష్టపడ్డప్పుడు మేము ఆయన నామాన్ని కూడా ఇష్టపడతాం. అందువల్ల మేము ఆయనను పిలవాలనుకుంటాము. అది చాలా మటుకు దానంతటదే జరుగుతుంది. కానీ ఒకవేళ పిలవడం అన్నది దానంతటదే జరగనపుడు అక్కడ మన ప్రయత్నానికి తావుందా?

**గురువుగారు :** అవును. ఇప్పుడే ఎవరో అడిగారు 'ప్రార్ధన సహాయపడుతుందా'? అని. అవును! సహాయపడుతుంది. నువ్వు బాబాను పిలవడం – ఇదే ప్రార్ధన అంటే. నీకు నిజంగా అవసరమైనపుడు నువ్వు అలా చేస్తావు. ఎందుకంటే నీకు వేరే దారిలేదు. కనుక అంతకన్నా నువ్వు చెయ్యగలిగిందేముంది? అప్పుడు నువ్వు కూర్చుని నీ హృదయాంతరాళాలలో నుండి బాబాను వేలు, లక్షలసార్లు పిలవడానికి ప్రయత్నిస్తావు.

**భక్తుడు :** కానీ అది ప్రయత్నించడం అవుతుంది కదా!

**గురువుగారు :** అది నీ ప్రేమకు వ్యక్తీకరణ. ఆ ప్రేమను నువ్వు ఇంకా ఇంకా వ్యక్తం చేస్తున్నావు. ఇదే నేను ఇప్పుడు చెప్పింది: "నీకు ఎంతగా అవసరం వుంటే, అంతగా వ్యక్తీకరణ వుంటుంది, అంత ప్రేమా వుంటుంది. నువ్వు దానిని పొందుతావు!". అప్పుడు ప్రతిస్పందించే శక్తి మరియు స్వీకరించగలిగే శక్తి మెండుగా వుంటాయి. నీవు కేవలం నోటిమాటతో "నాకది ఇష్టం. నాకది కావాలి, నేను చాలా నిస్పృహతో వున్నాను, నాకది అవసరం అని చెప్పినంతమాత్రాన ఏమీ జరగదు. నిస్పృహగా ఎలా వున్నావు? నిజంగా నీవు అంతటి నిస్పృహలో వుంటే, అటువంటి నిస్పృహస్థితిలో నీవేం చేస్తున్నావు?





నీకది అత్యవసరమా? అత్యావశ్యకమా? తప్పనిసరా? అలా అయితే, దానిని పొందగలిగేలా పిలువు. అంతకుమించి ఏం చెయ్యగలవు? అలా పిలుస్తూ, పిలుస్తూ, పిలుస్తూ వుండటం నాకిష్టం. కానీ మనం అలా చెయ్యం. ఎందుకంటే మన మనస్సు చాలా జిత్తులమారి. అలా పిలవడాన్ని తప్పించుకోవడానికి మార్గాలు వెతుకుతూ వుంటుంది. అటువంటి పిలుపును మన జీవితావసరంగా చేసుకోవడానికి అంగీకరించదు.

నేను మిమ్మల్ని ఎప్పుడూ కోరేదేమిటంటే, ఆ పిలుపును మీ జీవితావసరంగా చేసుకోండి, మీ జీవిత విధానంగా మలచుకోండి. అప్పుడప్పుడూ అలా కూర్చుని, మనస్సు లగ్నం చేసి గంటల పర్యంతం ... పిలవండి, పిలవండి, పిలవండి. మీకు దాని ఫలితం కనిపిస్తుంది. మొత్తం ఎంత అద్భుతంగా, ఎలా మారిపోతుందో తెలుస్తుంది. మీరు దానిని ఒక సాధనాపద్ధతి అంటాము – అంటే అనుకోవచ్చు. నేను పట్టించుకోను. నేనైతే దానిని సాధనాపద్ధతి అనను. అది మీ అవసరానికి, మీ ప్రేమకు వ్యక్తీకరణ కావాలి. మీ హృదయంలో పిలవండి, మీ అవసరమంతా ఆసరాగా చేసుకొని బాబాను ఆర్తిగా, ఆర్ద్రంగా, హృదయపూర్వకంగా పిలవండి. ఊరికే నామాన్ని వల్లెవేయవద్దు. పిలవండి!

**భక్తుడు :** గురువుగారూ! బాబాను పిలవడం అనేది మన పారమార్థిక జీవితావసరం కావాలి అన్నారు కదా! మీ దృష్టిలో బాబాను పిలవడమంటే ఏమిటి? ప్రత్యేకంగా కూర్చుని బాబాను పిలవడమా లేక మన మామూలు రోజువారీ జీవితంలో బాబాను పిలవడానికి మార్గమేదైనా వుందా?

**గురువుగారు :** వాస్తవానికి నిజంగా పిలవడం అనేది మన భావోద్వేగానికి, ప్రేమకు వ్యక్తీకరణ. వుదాహరణకు, నీకు బాగా ఆకలిగా వున్నపుడు ఆహారం కోసం చూస్తావు (గురించి ఆలోచిస్తావు). దాని కోసం తపిస్తావు. ఇది ఒక రకంగా ఆహారం కోసం మనం పిలుస్తుండడమే. నువ్వు 'అన్నం, కూర' అని అనాల్సిన అవసరం లేదు. కాని మనస్సు 'అన్నం, కూర' అంటుంది. దాని కోసం వెతుకుతుంది. అంతకుముందు మీరు నామం చేసుకోవడం గురించి మాట్లాడారు కాబట్టి నేను 'వాచా పిలవడం' అని చెప్పాను. నిజానికి అది అన్వేషించడం కూడా. ప్రేమించడం, ఆ ప్రేమను వ్యక్తీకరించడం, తపించడం – ఇలా దానికి చాలా పదాలున్నాయి. సందర్భాన్ని బట్టి, పదం వాడుక మారుతూ వుంటుంది. అది తపన కావచ్చు, అది ఒక భావోద్వేగం కావచ్చు లేదా ఒక వ్యక్తీకరణ కావచ్చు. కేవలం చింతన చేస్తూ ఆ ప్రేమను అనుభవిస్తూ, ఆస్వాదించడం కావచ్చు. నా వరకు, ఇవన్నీ పిలవడం వంటివే. ఉదాహరణకు, మీకు సత్సంగం కావాలనుకుంటారు. కానీ సత్సంగం జరగలేదనుకోండి... మీరు సత్సంగం గురించే ఆలోచిస్తూ, "సత్సంగం ఉంటే ఎంత బాగుండేది, సత్సంగం కావాలని మేము ఎంతగానో కోరుకుంటున్నాం" అంటారు. ఇది సత్సంగం కోసం పిలుపులాంటిదే. ఇలా చాలా విషయాలవ్యక్తీకరణకు 'పిలుపు' అనే

పదం వుపయోగపడుతుంది. బాబాను ఆహ్వానించడం(Call about); బాబాను అర్థించడం (Call On); బాబాను అడగటం(Call for). ఇవన్నీ బాబాను పిలవడమే. ఇంగ్లీషులో విభక్తి (Preposition)ని మార్చడం ద్వారా చాలా వ్యక్తీకరణలు వస్తాయి. అవి ఏమైనా సరే అన్నింటి గురించి ఆలోచించండి – అవన్నీ పిలవడం వంటివే. కొన్నిసార్లు బాబాను అర్థిస్తావు, కొన్నిసార్లు బాబాను అడుగుతావు, కొన్నిసార్లు బాబాను ఆహ్వానిస్తావు.

**భక్తుడు :** కానీ నిజానికి అలా పిలవడానికి అపరిమితమైన అవకాశాలున్నాయి, ఏ రకమైన వ్యక్తీకరణైనా పిలవడమే అవుతుంది.

**గురువుగారు :** ఏ వ్యక్తీకరణైనా పిలవడం కాదు. అది ప్రేమకు వ్యక్తీకరణ కావాలి. అవును! ఎలాంటి వ్యక్తీకరణైనా కాదు. ప్రేమకు సంబంధించిన ఎలాంటి వ్యక్తీకరణైనా (పిలవడమే)!!

**భక్తుడు :** జీవితం ఆనందంగా వుంటే, ఇంకా అడగటానికి ఏముంటుంది?

**గురువుగారు :** మనలో కొంతమందికి అవసరమైనవన్నీ వుంటాయి. కానీ మనం అడుగుతూ వుంటాం. అలా అడగటంలో ఆనందం వుంటుంది. తృప్తి వుంటుంది. అదే దానిలో వుండే అందం.

**భక్తుడు :** దేనిలో వుండే అందం?

**గురువుగారు :** (గురువుగారు నవ్వుతూ) ... నేను చెబుతున్నది, అడగటంలో వుండే అందం గురించి. ఏమీలేనివాళ్లు మాత్రమే అడుగుతారని కాదు – చాలామంది విషయంలో ఇది నిజమే కావచ్చు. కాని కొంతమందికి అన్నీవుంటాయి. అయినా వాళ్లు అడుగుతూ వుంటారు. ఎందుకు? ఎందుకంటే అడగటం అనేది వాళ్ల ప్రేమకు వ్యక్తీకరణ. దానిని పొందడం కూడా వాళ్ల ప్రేమకు వ్యక్తీకరణే అవుతుంది. బాబా మార్గంలో ప్రతిదీ ఎంతో ఆనందంగా వుంటుంది. మనం ఆనందంగా వున్నాం కాబట్టి అడుగుతాం. అంతేకాని మనం పాపులమని, దౌర్భాగ్య ప్రాణులమని, హేయమైన జీవులమని కాదు. మనం ఎంతో ఆనందంగా వున్నాం కాబట్టి అడగడం ద్వారా మన ప్రేమను వ్యక్తం చేస్తున్నాం. అదే దానిలో వుండే అందం! ఆనందంగా అడగడం, అలా అడగటమన్నది మన ప్రేమకు వ్యక్తీకరణ కావడం, అదీ నిజమైన సాయిపథం. అది ఎలా అంటే, ఇప్పుడు మీరు ఎన్నో ప్రశ్నలు వేస్తున్నారు. వీటికి సమాధానాలు మీకు నిజంగా అవసరం కాదు. ఆ విషయం నాకు తెలుసు. అడగటం అన్నది మీ ప్రేమకు వ్యక్తీకరణ. నేను సమాధానాలు చెప్పడం నా ప్రేమకు వ్యక్తీకరణ. అదీ అడగటం అంటే! అందుకే నేను దానిని ఆస్వాదిస్తాను. దానిని ఇష్టపడతాను!! (గురువుగారు నవ్వుతూ)... జీవితమంతా అలా వుండాలి.

మనం అడగటం అనేది మన ప్రేమకు వ్యక్తీకరణ. ప్రాపంచికంగా ఎటువంటి లోటూ వుండదని బాబా అభయమిచ్చారు. నీ జీవితంలో నిజమైన దుఃఖానికి చోటులేదు. నీవు అన్నీ





పొందుతావు. నీకు డబ్బు కావాల్సివస్తే బాబా ఇస్తారు – కావాల్సినంత! మంచి ఇల్లు కావాలంటే, ఆయన ఇస్తారు. నీకు మరేదైనా కావాలంటే, దానినీ ఇస్తారు. ఇవన్నీ వున్నప్పటికీ ప్రేమ కొరకు, కేవలం ప్రేమ కోసం... మనం అడుగుతూ వుంటాం. అలా అడగటంలో అందం వుంది. అందులో రసాత్మకమైన అనుభూతి వుంది. అదే రస సిద్ధాంతం! జీవితపు సారాన్ని (జీవితం యొక్క రసాన్ని) మనం ఎలా అనుభవిస్తాం, వృద్ధి చేసుకుంటాం అనే దానిని, ఊరికే మనం మామూలు అనుభవాలలో కూడా తెలుసుకోవచ్చు. జీవితమంతా మధుర రసభరితం చేసుకొని, దానిని ఆస్వాదిద్దాం. అదే రసానుభూతి, రసాత్మక జీవితానుభవం. అదే సాయిపథం.

## నమస్కారం - *అక్టోబర్ 2011*

**గురువుగారు :** నమస్కారం అంటే 'న'–'మ' లేక 'నేను–లేను', మరియు 'ఆస్కారం'. కాబట్టి 'నేను' లేక 'నాది' అనే వాటికి ఆస్కారం లేదు అని దాని అర్థం. ఏ స్థితిలో నేను, నాది అనే వాటికి ఆస్కారం ఉండదో అది నమస్కారం. అంతేగాని "అతను నాకు నమస్కారం చేసాడా?" లేకపోతే "అతను ఈరోజు నాకు నమస్కారం చేయలేదు" అని కాదు. అది నమస్కారానికి పూర్తిగా విరుద్ధమైనది. మన అహంకారం మరియు నేను, నాది అనే భావన సద్గురు పాదాలక్రింద అణగిపోవాలని మనం ప్రార్థిస్తాం కదా (ప్రార్థించమా?) కాబట్టి మనం నమస్కారం చేసిన ప్రతిసారి అటువంటి భావోద్వేగం, వినమ్రభావం కలగాలి. ఆ నమస్కారానుభవాన్ని ఉజ్జీవం చేసుకోవడానికి వీటిని మరింత బలీయం చేసుకోవాలి. అది సాష్టాంగనమస్కారమైనా, పాదనమస్కారమైనా, మీరు చేసే మరే ఇతర నమస్కార రూపమైనా – నమస్కారమనే ఆచారవిధి వెనుక గల ఉద్దేశ్యము ఇదే.

**భక్తుడు :** మీరు చెప్పిన వివిధ నమస్కారాలు ఏమిటి?

**గురువుగారు :** హృదయం ముందు అరచేతులను జోడించడం (అంజలి) నమస్కారం. పూజనీయులు లేదా మహాత్ములపాదాలను స్పృశించడం పాద నమస్కారం. సాష్టాంగ నమస్కారం అంటే శరీరం యొక్క మొత్తం ఎనిమిది అంగాలను నేలపై ఆనించడం; అందువలన ఏ అవయవం కూడా మిగతా వాటికన్నా వున్నత స్థాయిలో ఉండదు. శిరస్సు మాత్రమే కాదు, శరీరంలోని మొత్తం అవయవాలన్నీ నేలపై సమతలంగా వుంటాయి. ఇంగ్లీష్‌లో "He fell flat infront of him" ("ఇతను ఆయన ముందు సాగిలపడ్డాడు") అంటారు కదా అలాగన్నమాట. దానర్థం ఏమిటంటే అతని అహం అంతా పోయింది. ఇంకేమీ మిగలలేదు. మనకు కావలసింది అదే కానీ సవ్యమైన రీతిలో. మనం అటువంటి వినమ్రతను కోరుకునేటపుడు, మనకటువంటి కోరిక వున్నపుడు ఎన్నిసార్లు అనే ప్రశ్న ఎక్కడిది? వాస్తవానికి అటువంటి నమస్కారమనేది నిరంతరం జరగాలి, అప్పుడు నిరంతర నమస్కారస్థితిలో వుంటారు. అందుకే ముస్లింలు నమాజు చేసేటపుడు

ఒక చిన్నగుడ్డను తలమీద కప్పుకుంటారు – ఎవరి దివ్యత్వమైతే తమ శిరస్సులపై వుందో, అటువంటి భగవంతుని (అల్లా) క్రింద తాము వున్నామన్న దానికి సంకేతంగా! ఇదే కారణంతో బాబా తలమీద గుడ్డను ధరించేవారు.

**భక్తుడు :** వాళ్లు తమ తలపై ఏదైనా ధరిస్తారా?

**గురువుగారు :** అవును! వారికి వినమ్రతాభావాన్ని అనుభూతి చెందడానికి దోహదంచేసే ఒక ఆచ్ఛాదనమిది. అందుకనే నమాజు చేసేటపుడు తమ తలపై కప్పుకుంటారు. ఫకీరు అంటే నిరంతరం నమాజు చేస్తూనే వుండేవారు, రోజుకు నాలుగైదుసార్లు మాత్రమే కాదు, ఆయనెప్పుడూ నమాజు స్థితిలోనే వుంటారు, అందువల్ల ఆయన తమ తలపై ఎప్పుడూ కప్పుకునే వుంటారు.

**భక్తుడు :** నిజానికి మేమంతా పాద నమస్కారం కోసం ఆతృతగా ఎదురు చూస్తూ వుంటాము. అటువంటి అవకాశం గనుక వస్తే మేము ఆ అవకాశాన్ని వదులుకోము అనుకుంటుంటాము. కానీ (అయితే) పాదనమస్కారం యొక్క ప్రాముఖ్యత ఏమిటి? మా భక్తికి అది ఎలా సహాయపడుతుంది? ఎంత తరచుగా అది అవసరమవుతుంది? దీని గురించి కాస్త వివరిస్తారా?

**గురువుగారు :** వాస్తవానికి పాదనమస్కారం అనే ఆచారం వెనుక గలఅంతరార్థమేమిటంటే, మన శరీరంలోని అత్యున్నత భాగమైన శిరస్సును అన్నింటికన్నా క్రింద స్థానానికి తీసుకురావడం, క్రిందస్థానం (క్రిందికి) అంటే ఏ స్థాయికి? సద్గురువు పాదాలచెంతకు. మనం ఆయన ముందు, ఆయన పాదాలచెంత మనం అన్నింటికంటే తక్కువ వారమని, వినమ్రులమని ఆయనకు తెలపడానికి అలా చేస్తాం. కాబట్టి మన శరీరంలోని అత్యున్నత భాగాన్ని సద్గురువు యొక్క అధోభాగమైన పాదాలవద్దకు తీసుకువస్తాం. తలను ఆయన (సద్గురువు) పాదాలదగ్గర వుంచడం, పాదాలను స్పృశించడం అనే ఆచారం అలా వచ్చింది. నీ తలను సద్గురువు పాదాలవద్ద ఉంచాల్సిన అవసరం నీకున్నంతవరకు నువ్వు దానినివీలైనంత తరచుగా చేస్తుండాలి. నిజానికి అది (తల) నిరంతరం అక్కడే (పాదాలవద్ద) వుండాలి. ఎంత తరచుగా అన్నది కాదు, ఎప్పుడూ మన శిరస్సు సద్గురు పాదాలదగ్గరే వుండాలి. ఈ అంగముద్రలన్నీ మన ఎఱుకను మరింత స్పష్టం చేసుకోవడానికి సహాయపడతాయి. అన్ని ఆచారాలవెనుక వుండే అంతరార్థం ఇదే. "ఒక్కసారి చేస్తే సరిపోతుందా!"–చాలదు! అది ఆ ఎఱుకను కలిగించడానికి, దానిని ఇంకా ఇంకా ఎక్కువ చేసుకోవడానికి మాత్రమే. అంతే! దానికున్న ఏకైక అర్థం అదే. అసలు నిజమైన నమస్కారమంటే బాబా పాదాలు ఎప్పుడూ మన తలపై వున్నాయి అన్న ఎఱుకే. దానిని బాహ్యంగా చేయడమన్నది మన అంతరంగంలోని ఆ అనుభవానికి అభివ్యక్తీకరణ మాత్రమే. అన్నీ పూజా (ఆచార) విధులు ఇటువంటివే.





**గురువుగారు :** బాబా ఫొటోనుచూసిన ప్రతిసారీ నమస్కరించాలా అని అతడు అడుగుతున్నాడు. బాబా ఫొటోకు నమస్కారం చేయకుండా ఉండడానికి పరిష్కారం ఏమిటంటే, నువ్వు బాబా ఫొటోను చూడనపుడు కూడా నిరంతరం నమస్కారం చేస్తుండటమే. నువ్వు హృదయంలో గనుక ఎప్పుడూ నమస్కరిస్తూ వుంటే అప్పుడిక బాహ్యంగా నమస్కరించాల్సిన అవసరం వుండదు. కాబట్టి ఎప్పుడూ నిరంతర నమస్కార స్థితిలో వుండండి. అప్పుడు మాత్రమే బాహ్యమైన వ్యక్తీకరణ అవసరం వుండదు. అలా కాకపోతే మీరు తప్పనిసరిగా నమస్కరించాలి. నేను చేస్తాను. దానిలో తప్పేమీ లేదు. మీ ఆఫీస్‌లో పై అధికారిని చూస్తావు, అతను నీ వైపుగా వస్తూ వుంటాడు. నువ్వు "నమస్తే సర్" అని చెప్తావు. చెప్పరా మీరు? అలా చేయడానికి నువ్వేమీ సిగ్గుపడవు. బాబా దగ్గరకు వచ్చేటప్పటికి అది మనకు సమస్యగా వుంటుంది! అలా వుండకూడదు. నేను నమస్కారం చేస్తాను.

**గురువుగారు :** మన ఆలోచనలన్నింటినీ, మన భావోద్వేగాలన్నింటినీ, అన్ని సంస్కారాలను, అన్ని వాసనలను వదిలిపెట్టి మనల్ని మనం ఖాళీ చేసుకోవాలి. మనం నిర్మలంగా వుండాలి. మనం చా...లా ఖాళీగా వుండాలి!! ఈ శూన్యత (ఖాళీ) యొక్క ప్రయోజనం గురించి మనకు ఒక అస్పష్టమైన అభిప్రాయం వుంటుంది. కానీ మనకది నచ్చదు, నిజానికి దానిని మనం ఎదుర్కొనలేము. అందులోని పరస్పర వైరుధ్యం, ద్వైదీభావం అదే. కాబట్టి మొదట మనకు ఈ శూన్యం గురించి తెలియాలి. అందుకే నేను శూన్యం అన్న పదాన్ని వాడను, నేను దానిని ఎప్పుడూ పరిపూర్ణత్వమంటాను. మనం పూర్ణంగా నిండిపోవాలి. దేనితో? సంతోషంతో, ఆనందంతో, తృప్తితో. కానీ అక్కడ ఖాళీ వుండాలి. మనం చాలా ఖాళీగా వుంటాం కానీ దేనినీ లోపలికి రానివ్వం. అదెలాగంటే, ఒక పాత్రలాగ అన్నమాట. ఒక పాత్రను తీసుకోండి, మీ స్నానాలగదిలో ఈ ప్రయోగం అందరూ చేయవచ్చు (నవ్వులు). ఒక పాత్రను నీళ్లున్న బొక్కెనలో తలక్రిందులుగా, నిట్టనిలువుగా 90 డిగ్రీలలో ముంచండి. ఆ పాత్ర ఖాళీగానే వున్నప్పటికీ, ఒక్క చుక్క నీళ్లు కూడా లోపలికి పోవు. ఎందుకని? అది ఖాళీగా వుంది కాబట్టి. మనకు తెలిసినంతవరకు అది ఖాళీనే. కానీ అది నిట్టనిలువుగా వుంది. కాబట్టి అప్పుడు మనం కొంచెం ఒక్క డిగ్రీ వంచితే నీళ్లు లోపలికి వస్తాయి. ఇంకొంచెం, ఇంకో డిగ్రీ వంచితే మరికొన్ని నీళ్లు లోనికి వస్తాయి. మరొక డిగ్రీకి మరికొద్ది నీళ్ల కాసేపటి తరువాత నువ్వు వంచాల్సిన అవసరం లేదు. ఎందుకంటే నీళ్లు లోపలికి త్రోసుకు వచ్చేస్తాయి. మిగతాది తనంతట తానుగా నిండిపోతుంది. మనమంతా పాత్రలలాంటి వాళ్లం. అనుగ్రహానంద మహిత జలాలలో తలక్రిందులుగా ఉంచబడిన పాత్రలం. కొన్నిసార్లు బాబా "మీరందరూ తలక్రిందులుగా ఉన్న (బోర్లించిన) కుండలలాంటివారు" అని చెప్పింది దీని గురించే. మనందరి గురించి ఆలోచించినపుడు, ఎందుకు ఆయన సరిగ్గా ఆ సారూప్యమే చెప్పారో నాకు మనసుకు వస్తుంది. మనమంతా ఖాళీ కుండలవంటి వాళ్లం, కానీ మనం పూర్తిగా తలక్రిందులుగా వున్నాం, ఆయన మనలో ఏదైనా పోయాలని అనుకున్నా


లేదు, మనం దానికి ఒప్పుకోం, మనం చాలా గట్టిగా తొణక్కుండా వుంటాం కాబట్టి ఏమీ లోపలికి వెళ్లదు. మనం చేయవలసిన ప్రయత్నం ఏమిటంటే కాస్త నాలుగైదు డిగ్రీలు ఒరగడానికి కృషి చేస్తే మిగతా దాని గురించిన బాధ్యత తీసుకోబడుతుంది. మొత్తం సమస్యంతా ఆ నాలుగైదు డిగ్రీలతోనే వస్తుంది.

**భక్తుడు :** కానీ గురువుగారూ! ఈ నాలుగైదు డిగ్రీలు ఒరగడం మేము చేయాలి కదా? దానిని మేమెలా చేయగలం?

**గురువుగారు :** శూన్యత్వస్థితి గురించి భయపడకుండా ఉండి, అనుగ్రహసాగరంలో నువ్వు నిజంగా తలక్రిందులుగా వున్న కుండవని తెలుసుకున్నపుడు, ఇక అక్కడ ఏం చెయ్యాల్సిన అవసరం లేదు. జరగవలసింది సవ్యంగా జరిగిపోతుంది. కానీ సమస్యేమిటంటే "మేం ఖాళీగా వున్నాం, లోపలికేం రావట్లేదు. మేము ఇక్కడ ఎన్నో కష్టాలకోర్చి, ఇలాగే చాలా రోజులనుండి వున్నాం, సముద్రంలో వున్నా, ఇంకా ఖాళీగా వున్నాం". మనం నిజంగా ఖాళీగా వున్నామా? లేదు, మనలో నిండా గాలి వుంది (గురువుగారు నవ్వుతూ) అది కూడా వుంది, కానీ మనం ఆ గాలిని ఇష్టపడం. కాస్త వంచండి, అప్పుడు బుడబుడమని బుడగలు వస్తాయి. ఇవే మీకు కలిగే ఆధ్యాత్మికానుభవాలు (గురువుగారు నవ్వుతూ)

**భక్తుడు :** కానీ మమ్మల్ని మేము ఎలా వంచుకోగలం?

**గురువుగారు :** నేను మీకు చెప్పాను. మీరు ఒక పాత్ర అని మీరు తెలుసుకుంటే, మీరు వంచబడతారు. లోపలికి నెట్టుకొని రావడానికి ప్రయత్నిస్తున్న ఆ (నీటి) ఒత్తిడిని ఎంతోకాలం ఆపలేము. ఆ అవగాహన కలిగినపుడు, హఠాత్తుగా పాత్ర తిరిగిపోతుంది, అప్పుడు మీరంటూ మిగలరు. కానీ నువ్వు బలవంతంగా పాత్రని పట్టుకుని వున్నావు. "నీళ్లేవీ లోపలకు రావడం లేదు, ఏమీ లేదు" అని అడుగుతున్నావు, ఫిర్యాదు చేస్తున్నావు. దానిని అలా పట్టుకొని వున్నపుడు లోపలికి నీరెలా వస్తుంది? నీటికి శక్తి లేదు. కొంతకాలం తరువాత అలా పట్టుకోవడంలో నువ్వు అలసిపోయినపుడు, నిన్ను నువ్వు నిటారుగా ఉంచుకునేందుకు అశక్తుడవైనపుడు నీరు లోపలికి వస్తుంది. అందుకనే ఆ అశక్తతను, అసహాయతను అనుభవించవలసి వస్తుంది. దాని వలన మనం కొంచెం వంచబడటం, వంగడం జరుగుతుంది. మనం బాబా ముందు సాష్టాంగపడినపుడు జరిగేది అదే. నువ్వు వంగుతున్నావు, నీ పాత్ర ఒరుగుతుంది. అది గుర్తుంచుకోండి. ఇలా ఒక్కొక్క డిగ్రీ ఎక్కువయ్యే కొద్దీ అనుగ్రహజలం అంత ఎక్కువగానూ లోపలికి వస్తుంది. అదీ నమస్కారం. ఇలా ఇక్కడ వంచడం కాదు. ఇక్కడకు వచ్చి నా ముందర వంగి వుండటం కాదు. నేనెప్పుడూ మీరు మీ పాత్రను వంచుతారని, కొద్దిగా ఎక్కువగా వంచుతారని ఆశిస్తాను.





# సబ్‌కా మాలిక్ ఏక్


పూజ్య గురుదేవులు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీగారి పాద పద్మములకు నా నమస్సులు. నాకు మొదటిసారిగా సాయిబాబా అంటే తెలిసింది నేను 7వ తరగతి చదువుతున్నపుడు. అది ఎలాగంటే నేను చదువులో చాలా వెనుక. రోజూ దెబ్బలు తినేవాడిని. ఒకరోజు మా తరగతిలో ఎవరో సాయిబాబా ఫొటో వున్న క్యాలెండర్ తీసుకువచ్చి గోడకి పెట్టారు. సాయిబాబా ఫొటో క్రింద సబ్‌కామాలిక్ ఏక్ అని రాసి వుంది. అది నేను మనస్సులో అనుకున్నాను. ఆరోజు నాకు దెబ్బలు పడలేదు. ఇవాళ ఏమిటి నాకు దెబ్బలు పడలేదు అనుకున్నాను. రెండవరోజు మరలా నా మనస్సులో సబ్‌కామాలిక్ ఏక్ అనుకున్నాను. అప్పుడు కూడా టీచర్ ఏమీ అనలేదు. చదువు కూడా కొంచెం బాగా చదవడం మొదలుపెట్టాను. ఫస్ట్‌క్లాసులో పాస్ అయ్యాను. ఆ తరువాత నేను వేరే స్కూలులో జాయిన్ అయ్యాను. అక్కడ టీచర్ క్లాసులో పాఠము చెపుతుంటే నేను పుస్తకంలో సాయిరామ్ అని రాసుకుంటూ ఉండేవాడిని. ఒక్క పాఠము కూడా వినేవాడిని కాను. నా 10వ తరగతి అయిన తరువాత ఒక చిన్న పని చూసుకున్నాను. అక్కడ ఒక గురుబంధువు వుండేవారు. ఆమె గురువుగారి గురించి, సాయిబాబా గురించి చెపుతూ వుండేది. నాకు శిరిడీ వెళ్లాలని అనిపించింది. 1998 డిసెంబరు 31వ తేదీన నేను గురువుగారిని చూడటం, పాదదర్శనం చేసుకోవడం జరిగింది. నేను సాయిబాబాని కదా కొలిచేది, మరి ఈయనకి మొక్కుతున్నాను ఏమిటి అని మనస్సులో ఉంది. కాని అదే నా జీవితాన్ని మార్చుతున్నదని అప్పుడు తెలియలేదు. ఆశ్రమంలో సాయిబాబా నామం చెప్పటం చూసి నాకు సాయిబాబా అంటే, సాయిబాబా నామం అంటే ఇష్టం మరింత పెరిగింది. సాయిరామ్ అంటే అది నాకు సగమే పలికినట్లుగా ఉండేది. సాయిబాబా పూర్తిగా పలికినట్లు వుండేది. ఆ తరువాత శిరిడి నుండి వచ్చాను. కాని నా మనస్సు సాయిపథములో జరుగుచున్న సాయిబాబా నామము మీదనే వుంది. అప్పటి నుండి (12 సంవత్సరములు) ఇప్పటి వరకు సాయిబాబా నామము నా మదిలో జరుగుచున్నది. ఉదయం లేచిన దగ్గర నుండి రాత్రి పడుకునే వరకు, ఒక్కొక్కసారి రాత్రి పూట కూడా సాయిబాబా నామము జరుగుచున్నది. అది కేవలం గురువుగారి కృప. సాయిబాబా అంటే ఏమిటో, ఆయన చూపిన మార్గము ఏమిటో ఆ మార్గములో ఎలా వెళ్లాలో చెపుతూ గురువుగారు రాసిన "సాయిభక్తి సాధనా రహస్యము" నాకు చాలా ఇష్టము. గురువుగారిని దర్శనం చేసుకున్నది తక్కువసార్లయినా కాని ఆయన నామీద చూపిన దయ అపారమైనది, చెప్పలేనిది. గురువుగారు సశరీరులుగా ఉన్న రోజులలో ఆయన ఇప్పుడు మద్రాసులో లేక అరుణాచలంలో లేక శిరిడీలో వున్నారు అని అనుకునేవాడిని. కాని ఇప్పుడు సమాధి రూపులు అయిన తరువాత, ఆయన నా ప్రక్కన వున్నట్లు దగ్గర వుండి సాయిబాబా నామాన్ని నాలో జరిగింప చేస్తున్నట్లు వుంది. గురువుగారు చెప్పినట్లు ఆధ్యాత్మికత అనేది జీవితంలో ఒక భాగము కాకూడదు. ఆధ్యాత్మికతలోనే జీవితము ఒక

భాగము కావాలి అన్నట్లు చేసారు. నాకు చదువు లేకపోయినా, డబ్బులేకపోయినా, అంతకంటే విలువైన సాయిరూపాన్ని, సాయిబాబా నామము నాకు ఇచ్చారు గురుదేవులు. నాది ఒక్క కోరిక. అరుణాచలంలో స్థిరపరిచి, నా మనస్సులో ఎలాంటి ఆలోచనలు లేకుండా సాయిబాబా నామము మాత్రమే ఉండేటట్లు గురుదేవులను కోరుచూ నమస్కరిస్తున్నాను. – ***శరత్ అరుణాచల, విజయవాడ.***

## స్వాధ్యాయం - ఓ అద్భుత వ్రతం

ఇరవయ్యో శతాబ్దంలో భోగవాదం, భౌతిక వాదం మానవుడిని అధఃపతనం గావించాయి. యంత్రాల నిరంతర సంపర్కం మూలాన మానవుడు అచేతనుడుగా, భావశూన్యుడుగా, స్వార్థ పరాయణుడుగ, అవకాశవాదిగా, కాంచనలోలుడుగా మారాడు. వాని వ్యక్తిగత జీవితం చింత చీకాకులతో, ఉద్విగ్నతతో, నిరాశనిస్పృహలతో నిబిడీకృతమైంది. త్యాగం, తపం, స్నేహ సహకార పునాదులపై ఆధారపడిన కుటుంబ జీవితం నేడు భావానికి బదులు భోగానికి, ధర్మానికి బదులు ధనానికి, స్నేహానికి బదులు స్వార్థానికి ఆలవాలమైంది. సమాజంలో శాంతి, స్వాస్థ్యం, చిత్తస్థైర్యం మృగ్యమయ్యాయి. ఓట్లను, నోట్లను, ఆహార పదార్థాల్ని ఎలా సేకరించడం అన్నదే నేటి మానవుని ఆరాటం, పోరాటం.స్వార్థం మితిమీరింది. నేటి యువతరం స్వాతంత్ర్యానికి వికృత అర్థం కల్పించి, ఊహించి, స్వచ్ఛందంగా, ఉచ్ఛృంఖలంగా మారిపోతుంది. సనాతన విలువల్ని మంటగలుపుతుంది. ధనాన్ని అర్జించడం, భోగాన్ని అనుభవించడం, సంసారాన్ని ఈదడం, సుఖంగా వుండడమే జీవితలక్ష్యంగా భావిస్తున్నాడు. ఇంతకుమించి నేటి మానవుని దృష్టి ముందుకు పోవడం లేదు. ఇది తప్ప వానికి మరో ఆలోచన లేదు. "లాభమే" వాని గమ్యం, "వాగ్దానమే" వాని జీవితం, 'ఆచారమే' వాని వ్యవహారంగా మారింది.

నేడు అంతటా అశాంతి తాండవిస్తుంది. అంతట అసంతృప్తి నెలకొని వుంది. భోగలాలసత మితిమీరి పోయింది. దుఃఖిత సమాజం నేటి ధీమంతుల్ని, అంతఃకరణం గల వ్యక్తుల్ని ఆహ్వానిస్తుంది. ప్రస్తుత యుగం ఆహ్వానయుగం, సహృదయుడు, ఆలోచనాపరుడు, విద్యావంతుడైన నేటి మానవుడు వ్యథతో కుమిలిపోతున్నాడు. ఈ వినాశం నుండి ధర్మాన్ని, మనలను రక్షించడానికో మార్గదర్శకులుగా రామకృష్ణాది అవతార పురుషులు, సద్గురువులు నిరంతరం కర్మ ప్రపత్తులై 'సాధ్వాయం'ను అందించారు. స్వాధ్యాయం ద్వారా మహాత్ముల తేజోవంతమైన జీవన స్రవంతి నిరంతరం ప్రవహిస్తూ వుంటుంది. వే ఆఫ్ లైఫ్ (జీవన విధానం), వే ఆఫ్ వర్షిప్ (ఉపాసన విధానం), వే ఆఫ్ థింకింగ్ (ఆలోచనా విధానం) పవిత్రముగా ఎడతెగక ప్రవహిస్తూ వుంటుంది, మనల్ని మలుస్తూ వుంటుంది.



**స్వాధ్యాయమనగానేమి :** వర్ణన ద్వారా కలకండ మాధుర్యాన్ని చవిచూడలేం, తినవలసి వుంటుంది. స్వాధ్యాయం కూడా ఇలాంటిదే. స్వాధ్యాయాన్ని అర్థం చేసుకోవాలి, తాను



చేయాలి. ఇతరులతో కూడా చేయించాలి. అలాంటి జీవితాన్ని అలవరచుకోవాలి. స్వాధ్యాయ కార్యాన్ని కొందరు మనోధృఢత్వానికి, భౌద్ధిక స్థిరత్వానికి దివ్య ఔషదమని భావిస్తారు. స్వాధ్యాయం జీవన ఔషధమే కాని ఈ నిర్వచనం అసంపూర్ణమైనది. జబ్బుతో వున్నపుడే ఔషదం పుచ్చుకుంటాం, ఎల్లప్పుడూ వాడం. కొందరు స్వాధ్యాయాన్ని అన్నముగా భావిస్తారు. ప్రతిదినం ఆహారం ఎలా అవసరమో, అలాగే స్వాధ్యాయం కూడా నియమితంగా చేయవలసి వుంటుందని తలుస్తారు. కాని స్వాధ్యాయాన్ని అన్నంతో పోల్చడం కూడా సరియైనది కాదు. ఎందుచేతననగా ఆహారాన్ని దినానికి రెండు పర్యాయాలే తీసుకుంటాం. అది కూడా ఓ నిర్ణీత సమయానికి. కాని స్వాధ్యాయం ప్రాణవాయువు (ఆక్సిజన్) లాంటిది.

ఈ ఉపమానం స్వాధ్యాయానికి సమంజసంగా వుంటుంది. పుట్టుకతో ప్రారంభమైన శ్వాసోఛ్వాస జీవితాంతం, ఆఖరి క్షణం వరకు నిర్విరామంగా సాగుతూనే వుంటుంది. నిద్రలో, జాగ్రత అవస్థలో, అన్నం తింటూవుండగా, నీళ్లు త్రాగుతూ వుండగా, కూచోని వున్న, లేచి నిలుచున్న, తిరుగుతూ వున్న అన్ని వేళల్లో ప్రాణవాయువు అవసరముంటుంది. అది లేకుండా ఓ క్షణమైన మానవుడు జీవించలేడు. అలాగే స్వాధ్యాయం కూడా ప్రాణ వాయువులా మహత్తుగలది. దీన్ని గ్రహించిన వాడే జీవన పథములో పురోగమించే సాధకునిగా మారగలడు. "స్వాధ్యాయం" ఇది ఓ సాంప్రదాయంగాని, ఓ వర్గంగాని , ఓ తెగగాని కాదు. ఇది ధర్మం కూడా కాదు. ఓ సంస్థ కూడా కాదు.

***మరి "స్వాధ్యాయం" అంటే ఏమిటి?***

స్వాధ్యాయం ఓ ప్రవృత్తి. ఇది ఉద్యమంలాంటిది కాదు. వృత్తిని ఉత్కృష్టగా, ప్రకృష్టంగా, శ్రేష్టంగా మార్చునది. మన్యుష్యుడిని శ్రేష్ఠుడిగా అనగా భగవంతునికి సంబంధించిన వానిగా మార్చు ప్రవృత్తి. స్వాధ్యాయం అనగా దైవకార్యం ఓనర్చే ప్రవృత్తి. స్వాధ్యాయం అనగా ధర్మాన్ని, సంస్కృతిని అర్థం చేసుకునే దృక్కోణం.

స్వాధ్యాయం అనగా గ్రహించడం. స్వాధ్యాయం అనగా ప్రకాశం. స్వాధ్యాయం అనగా వాయువు. స్వాధ్యాయం అనగా వివేకం. స్వాధ్యాయం అనగా ధ్యేయం, ఆదర్శమైన నిష్ఠ, స్వాధ్యాయం అనగా జీవన నిష్ఠ, స్వాధ్యాయం  అనగా కర్తవ్య పరాయణత. స్వాధ్యాయం అనగా భగవంతుని పట్ల ప్రేమ. స్వాధ్యాయం అనగా "స్వ" యొక్క అభ్యాసం. "స్వ" అనగా శరీరంలో వున్న చైతన్య తత్త్వం, దానికి అంటుకొని వున్న "అహం" మరియు "కోరిక". స్వయం  యొక్క "స్వ"ను అర్థం చేసుకోవడం ఇతరుల "స్వ"ను ఆదరించడం, దీన్ని అభ్యాసంలో పెట్టడమే "స్వాధ్యాయం".

మొట్టమొదట మనం చేయవలసింది "స్వాధ్యాయం" ద్వారా 'అహం'ను మృదుత్వంగా మార్చడం, క్రమక్రమంగా దాన్ని దైవంలో విలీనం చేయడం. 'అహం'ను మృదువుగా మార్చడం అనగా వస్తునిష్ఠ గల 'అహం'ను దైవనిష్ఠగా మార్చడం. అహం దైవనిష్ఠగా మారేదెప్పుడు? ఆ అహం వెనుక "నేను ఎవరికో సంబంధించిన వాడిని" అనగా "నేను భగవంతునికి సంబంధించిన వాడిని" ఇలాంటి మార్పు వస్తుంది. పరివర్తనం కలుగుతుంది. ఇప్పుడు దైవనిష్ఠ కలుగుతుంది. ఇలాంటి మృదువుగా మారిన అహం భగవంతునిలో అనాయాసంగా విలీనమై పోతుంది.

రెండవ విషయం – కోరికను, మంచి కోరికగా మార్చడానికి అందరూ సమావేశమై స్వాధ్యాయం చేయాలి. ఈ సత్కాంక్ష పరిణామం మూలాన మనుష్యుడు తన వ్యక్తిగత జీవితంలో దీనుడుగా, నిస్సహాయుడుగా మారడు. ఒకరి దాసుడు కాడు. ఒకరి ఉపకారాన్ని పొందడు, నిస్సహాయుడుగా వుండడు. స్వార్థపరుడుగా మారడు. పరిస్థితులకు తల వంచడు. పరాధీన జీవిగా బ్రతుకడు. అలాంటి వాడు ఓ మత్తులో వుంటాడు. ఆత్మగౌరవంతో ప్రజ్వలించు అతని జీవితం భావపూరితంగా వుంటుంది. ఆత్మాభిమానం జాగృతమై వుంటుంది. సద్భావాల మూలాన సమాజంలో ఎవరిపట్ల కూడా అతనికి చెడు తలంపు వుండదు. ఒకరికి హాని చేయడు పైగా తన శక్తి కొలది మంచి పనుల్ని చేస్తాడు. "భగవంతుడిని" కేంద్ర బిందువుగా భావించి వాని కార్యాల్ని చేపట్టుతాడు.

దీర్ఘకాలం, నిరంతరం స్వాధ్యాయ అభ్యాసం వల్ల సద్భావాలు దృఢమవుతాయి. అలాగే భక్తి ద్వారా దైవంపట్ల విశ్వాసం పెరుగుతుంది. దీని ఫలితంగా సత్కాంక్ష 'యదృచ్ఛం'గా మారుతుంది. గీతలో వక్కాణించబడినట్లు "యదృచ్ఛ" అన్నది భక్తి యొక్క పరిపాకం. ఇందులో భగవంతుని పట్ల దృఢమైన, సాటిలేని విశ్వాసం గోచరిస్తుంది.

నిజమైన, అవ్యాజమైన భక్తిలో భగవంతుడు, భక్తుడు విడిపడి వుండరు, వేరువేరుగా వుండరు. **'భక్తుడు అనగా విభక్తి కానివాడు'**. "నాలో వున్న భగవంతుడు ఇతరులలో కూడా వున్నాడు" అను జ్ఞానం కలుగగానే స్వాధ్యాయంలో పాల్గొను వ్యక్తి, భక్తి దృష్టితోనే ఇతరుల వద్దకు వెళతాడు. సంఘ సంస్కర్తలు ఇతరుల్ని మార్చడానికి, వారిని సంస్కరించే దృష్టితో వెళతారు. వారికి కాస్త పేరు రాగానే, యశస్సు కలుగగానే చెడిపోతారు. లేదా అపకీర్తి కలుగగానే నిరాశపూరితులవుతారు. కాని స్వాధ్యాయుని దృష్టి భక్తితో కూడి వుంటుంది. దీనివల్ల కీర్తి, అపకీర్తి అతనికి బాధాకరంగా వుండదు. స్వయంవికాసం పొందుతున్నట్లు దృఢవిశ్వాసం కలుగుతుంది.

సమాజంలోని ప్రతిమానవుడు ఇతర మానవుల సహాయ సహకారాన్ని పొంది పెద్దవాడవుతాడు, బలవంతుడవుతాడు. తల్లిదండ్రుల మమత అనురాగాలతో పిల్లలు





పెద్దవారవుతారు. మిత్రుని సహకారంతో మిత్రునికి ఆశ్రయం లభిస్తుంది. భార్యాభర్తలు పరస్పర ప్రేమాభిమానాల మూలాన ఆనందంగా జీవితం గడుపుతారు. స్వాధ్యాయి కూడా భక్తి ద్వారా తన తోటి మానవులకు సహాయ సహకారం అందిస్తాడు. జ్ఞానంలో భక్తి చోటు చేసుకున్నపుడు భగవంతునితో గల సంబంధాన్ని గుర్తిస్తాడు. అనంత సృష్టికర్త నాలో వేంచేసియున్నాడు.

నాతో వుంటూ సుఖదుఃఖాల్ని అనుభవిస్తూ వుంటాడు. ఇలాంటి జ్ఞానం కలుగగానే మనుష్యునిలోని వ్యసనాలు అనాయాసంగా తొలగిపోతుంటాయి. నియమిత స్వాధ్యాయం ద్వారా శ్రవణ మననం వల్ల ఎలాంటి వ్యసనాలు వుండవు. అవి అంతమౌతూ వుంటాయి. సూటిగా ఉపదేశం ఆవశ్యకత వుండదు. భక్తి ప్రభావం వల్ల వ్యసనాలు తొలగిపోతాయి. ఇది భక్తి యొక్క **సైడ్ ఎఫెక్ట్.** అంచేతనే 'స్వాధ్యాయాన్మప్రమదః' (స్వాధ్యాయం నుండి తొలగక అప్రమత్తుడనై వుండుము) అన్నారు.

ప్రపంచంలో ఎవనికి "స్వ" కళ్యాణం గురించి తీవ్రమైన కాంక్ష వుంటుందో, 'స్వ' ఉన్నతి పొందాలనే చింత వుంటుందో 'స్వ' ఉత్కృష్ఠం పొందాలనే వ్యాకులత వుంటుందో అతడు ఏదేశం వాడైనను, ఏ స్థలంలో వున్నను, ఏ స్థితిలో వున్నను స్వాధ్యాయాన్ని నిరోధించడు, ద్వేషించడు. ఎవడు తన బుద్ధినే ద్వేషిస్తాడో, తన జ్ఞానాన్ని నిరోధిస్తాడో అలాంటివాడే స్వాధ్యాయాన్ని ద్వేషించగలడు.

ఎవడైన ఒకవేళ నాస్తికుడిగా మారవచ్చు కాని బుద్ధిహీనుడుగా మారడానికి సిద్ధం కాడు. తెలివి అనగా బుద్ధితో కూడిన వ్యవహారం. **"మననశీలుడే మానవుడు".** స్వాధ్యాయంలో ద్వంద్వానికి, వ్యాజ్యానికి, కపటానికి స్థానం లేదు. జీవన వికాసం గురించి విన్న వాటిని మననం చేయాలి. జీవితంలో సుఖం వాటిల్లితే దాన్ని దైవప్రసాదంగా భావిస్తాడు స్వాధ్యాయి. దీనివల్ల నిరంతరం దైవస్మరణ జరుగుతుంది.

దైవకార్యంలో ఇంకనూ అరిగిపోవాలని కరిగిపోవాలనే వాంఛ కలుగుతుంది. ఆపదలో దేవుడిని తలచుకుంటాడు. ఎందుచేతనంటే దైవమే జాగృతపరుస్తాడు – హెచ్చరిస్తాడు. మన గురించి శ్రద్ధ వహిస్తాడని భావించబడుతుంది. నిరాశ దరికి చేరనివ్వడు. అసఫలత్వం స్పృశించదు. జీవితం రసమయంగా మారుతుంది. స్వాధ్యాయం వల్ల **'సత్ శ్రవణం'** జరుగుతుంది. స్వీయపాఠాన్ని జ్ఞాపకం చేసుకోవడానికి అభ్యాసరూపేణా ఇతరులకు చెప్పాలనే కోరిక కలుగుతుంది. దీనివల్ల **'సత్ కథనం'** (మంచిగా చెప్పడం) జరుగుతుంది. తన యొక్క జీవన వికాసం కోసం దాని యొక్క ఆవశ్యకతలను గ్రహిస్తాడు. దీని మూలాన **'సత్ చింతనం'** అలవడుతుంది. ప్రయత్నం కొనసాగుతుంది.

### స్వాధ్యాయం యొక్క ధ్యేయం :

విశ్వ మానవ మాంగల్యం కోసం మన ఋషులు, మునులు "తస్మాత్ స్వాధ్యాయ ప్రవచనభ్యామ్

నప్రమదితవ్యమ్" (అందువలన స్వాధ్యాయము నుండి ప్రవచనము నుండి తొలగకుము) అను మంత్రాన్ని ప్రసాదించారు. ఈ మంత్రం ద్వారా జీవన అంతిమ ధ్యేయం అనగా ఆత్మ వికాసం (అన్‌ఫోల్డ్‌మెంట్) సాధించబడుతుంది. జీవితంలో భగవంతుని ప్రేమను పొందవచ్చు.

పాపం అనగా క్షుద్రత, నిస్సహాయత్వం స్వాధ్యాయం వల్ల ఇవి నశించిపోతాయి. 'సాధుత్వాన్ని' అలవరచుకోవడానికి నిష్ఠతో అభ్యసిస్తారు. ప్రయత్నిస్తారు. స్వాధ్యాయం ద్వారా ఆత్మ వికాసాన్ని పొంది "వసుదైక కుటుంబ" భావనతో మెలగుతారు. "అందరి రక్తాన్ని నిర్మించింది ఒక్కడే" అనే భావం కలుగుతుంది. 'డివైన్ బ్రదర్‌హుడ్' దైవిభ్రాతృత్వ అనుబంధాన్ని అనుభవిస్తారు. తాము ఆలకించినది అవగాహన చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. అవగాహన చేసుకున్నదాన్ని ఆచరణలో పెడతారు.

"జ్ఞానం భారః క్రియావినా" అని వారికి తెలుసు. కార్యరూపం దాల్చని జ్ఞానం బరువుచేటు. చేతలతోగాక కేవలం మాటలతో చూపే ప్రేమ వట్టి మోసం, దంభం, ఏదేని కార్యం నెరవేర్చాలన్న మూడు విషయాలు ముఖ్యం. 1) సత్కారం నెరవేర్చిన – 'ఫలం' లభిస్తుంది. 2) నిష్కామకర్మలొనర్చిన – 'వికాసం' కలుగుతుంది 3) దైవం కోసం, భగవంతుని ఆనందం కోసం కర్మలొనర్చిన – 'భక్తి' అలవడుతుంది. స్వాధ్యాయులు ప్రభుప్రీత్యర్థం, ఆనంద ప్రాప్తి కోసం కర్మలు చేపడతారు. వారి కర్మల్లో ఉపదేశం, ప్రచారం, సంస్కరణ వుండదు. కాని భక్తి వుంటుంది. వారి చేతల్లో ప్రేమ పొంగి పొర్లుతుంది. ఆత్మ వికాసమే వారి ధ్యేయం.

## స్వాధ్యాయుని దృష్టి :

సమాజంలో సాధారణంగా మూడు వర్గాలుంటాయి. ఒకటి శ్రేష్ఠ వర్గం, రెండవది మధ్యమ, మూడవది కనిష్ఠ వర్గం. ఉచ్ఛతరగతికి చెందిన వారితో "అద్వేషంగా" వుండాలి. అనగా వారితో ద్వేషరహిత దృష్టితో మెలగాలి. సమానస్థాయి గలవారిని మైత్రః అనగా మిత్రుభావంతో చూడాలి. క్రిందస్థాయి గలవారిని 'కరుణ'తో కరుణాభరిత దృష్టితో చూడాలి. ఈ రోజుల్లో పెద్దవారిపట్ల ధిక్కారంతో, సమాన అంతస్తు గల వారితో తుచ్ఛంగా, కనిష్ఠ స్థాయిలోనున్న వారితో తిరస్కార భావంతో చూడబడుతుంది. ఇలాంటి తరుణంలో స్వాధ్యాయి దృష్టి మానవుడికి దివ్యజీవన విధానాన్ని అలవరుస్తుంది. **(సశేషం)**

**ఏష పంథా ఏతత్కర్మ** *అను గ్రంథం నుండి గ్రహించబడినది*


సాయి సమగ్రదర్శిని : **www.saibaba.com**

సద్గురు తత్త్వ దర్శిని : **www.gurukrupa.info**

గురుబంధువులు తమ అనుభవాలను పంపవలసిన mail ID : **gurukrupa@saimail.com**






## సమదర్శనాన్ని సాధించు!

జీవనయాత్రలో మనకు విద్యావంతులు దర్శనమిస్తారు. వినయసంపన్నులు గోచరిస్తారు. బ్రాహ్మణులు ఆశీర్వదిస్తారు. గోవులు చరిస్తాయి. ఏనుగులు కనబడుతూ వుంటాయి. కుక్కలు, ఆ కుక్కను చంపి తినేవాళ్లు కూడా మనకళ్లబడుతూ వుంటారు. అయితే వీరందరిలోనూ మనం ఒకే దైవాన్ని చూడగలగాలి! వారిని చూచినపుడు ఒకేలా స్పందించగలగాలి! మన మనస్సు ఆ స్థాయికి ఎదిగి రావాలి. ఆ దర్శనంలో మనం పండాలి! అప్పుడే మనం పండితులమనబడతాం! అలా పండినవాడే పండితుడు – అని మనకు తెలియాలి.

దైవము తప్ప వేరొకటి లేదు అని మనకు తెలుసును. ఈ లోకము ఆ దైవస్వరూపమని కూడా తెలుసు. అయితే మనం అనుక్షణం ఆ దైవాన్ని అనుభవించగలుగుతున్నామా! అన్నది ప్రశ్న. తెలియడం వేరు, అనుభవానికి రావడం వేరు. పెద్దలు చెప్పినందువల్లే వినికిడి జ్ఞానం వస్తుంది. మనకది ఒంటబట్టాలి! మనకది గోచరించాలి! మనమా అనుభూతిని చెందాలి! అప్పుడే అది నిజమయిన జ్ఞానమవుతుంది. దీనికి అభ్యాసం కావాలి! లోకంలో దైవాన్ని పొడగట్టించుకోవడం మనకు అభ్యాసం కావాలి! జీవిత నిర్వహణ సాగుతూ వుండగానే, నిరంతర దైవ సాక్షాత్కారం కొనసాగుతూ వుండాలి!

విద్యావంతులలో దైవాన్ని చూడటం కొంతవరకే సాధ్యం! అలాగే వినయ సంపన్నులలో కూడా! లోక శ్రేయస్సును కోరి వర్తించే బ్రాహ్మణులలో కూడా దైవాన్ని చూడటంలో మనకు అభ్యంతరముండదు. ఇక గోవు దైవస్వరూపమన్నది మనకు అనాదిగా వస్తున్న విశ్వాసం. కనుక అందులో దైవాన్ని చూడటంలో మనకు అభ్యంతరముండదు. ఏనుగున్నది దాని బలం, దాని కథ చూచినపుడు ఆశ్చర్యం వేస్తుంది. కాబట్టి దానిలో కూడా దైవాన్ని చూడవచ్చు. ఇంత వరకు బాగున్నది. ఆ ప్రక్కనే ఒక కుక్క వున్నది, అది మొరుగుతున్నది. దానిని మామూలు స్థితిలో కొంచెం ఇబ్బందిగానే వుంటుంది. ఇక ఆ కుక్కను చంపితినే వాడుంటాడు. కుక్కే నీచమయినది కదా, దానిని చంపి తింటున్నవాడు అంతకంటే నీచుడు, ఛీఛీ వీడి ముఖం చూడకూడదు. అని అనిపించే అవకాశమున్నది. ఇలా కొన్నిచోట్ల దైవాన్ని చూడటానికి సాధ్యమగుతున్నది. కొన్నిచోట్ల దైవాన్ని చూడటానికి కష్టసాధ్యమవుతున్నది. చెప్పేటపుడు అంతా దైవమే అని చెబుతున్నాం, చూసేటపుడు అంతటా దైవమే చూడగలుగుతున్నామా? మరి ఈ వ్యత్యాసమేమిటి?

అతడే ఇన్ని రూపాలతో గోచరిస్తున్నాడు. తిరుగాడుతున్నాడు, సృష్టికథను నడుపుతున్నాడు, సృష్టికి, ఈ రూపాలన్నీ అవసరం. ఆ రూపాన్ని ధరించడానికి అతనికే అవమానమనిపించనపుడు అందులో అతణ్ణి చూడటానికి మనకు సంకోచమెందుకు? పంది వున్నది. అతడు పందిగా కూడా వున్నాడు. కాని

మనం పందిని భరించలేకపోతున్నాము. అతనికి లేని అభ్యంతరం మనకేల? సృష్టికి తగిన విధంగా అతడే అన్ని రూపాలుగా ఒదిగిపోతున్నపుడు, మనమెలా ప్రవర్తించాలి? అతడికి తగినట్లుగా మనం కూడా ఒదిగి ప్రవర్తించవద్దా! సృష్టిలోని ఏ రూపాన్ని తక్కువగా చూచినా, 'అతణ్ణి' తక్కువగా చూచినట్లే అవుతుంది. ఏ రూపాన్ని కాదన్నా 'అతణ్ణి' కాదన్నట్లే అవుతుంది. ఎవరిని మనం హేళన చేసినా, అతణ్ణి హేళన చేసినట్లే అవుతుంది. ఎవరిని త్రోసిపారేసినా అతణ్ణి త్రోసిపారేసినట్లే అవుతుంది. ఇది మనం గుర్తించాలి. గుర్తించి తగిన విధంగా వర్తించాలి! ఈ సత్యాన్ని మనం గ్రహించిననాడు సృష్టిలోని ఏ వ్యక్తిగాని, ఏ జంతువును గాని మనం తక్కువచేసి చూడము. అంతటా దైవాన్నే దర్శిస్తాము. ఆయా నామరూపాలను దైవం ఎందుకు స్వీకరిస్తున్నాడో బోధపరుచుకుంటాం. ఇదంతా ఆయన వైభవమని తెలుసుకుంటాం! ఎప్పుడయితే మీరు ఎవరినీ తక్కువగా చూడరో, అప్పుడు సృష్టితో మీకు ఘర్షణ వుండదు. సృష్టిలోని సమస్యలన్నీ ఇక్కడే వస్తున్నాయి. ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అనుకోవడంలోనే వస్తున్నాయి. ఏనుగుగా వున్నవాడే కుక్కగా వున్నాడు, యజమానిగా వున్న దైవమే కూలీగా కూడా పనిచేస్తున్నాడు, ఈ దర్శనం మనకలవడాలి! ఎవరిపని వారు చేస్తూనే అందరూ ఒక్కటిగా బ్రతకాలి! ఎవరి పనివారు చేయకపోతే సమాజం నడవదు. అందరిలో దైవం కనబడకపోతే సమాజం నిలవదు, ఇది మనం గ్రహించాలి!

**– పార్థసారథి ప్రవచనాలు**

## లేదు శక్తి... నిన్ను ఎరిగేటి యుక్తి

డిసెంబర్ 13, 2010 శనివారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో హఠాత్తుగా ఆశనిపాతంలాంటి గురుదేవుల నిర్యాణ వార్త అందింది. ఏం చేయాలో దిక్కు తోచలేదు. మెదడు మొద్దుబారింది. అందరు గురుబంధువులకు ఈ వార్త తెలియచేస్తూ సత్సంగ మందిరానికి (చెన్నై) చేరాను. కొద్దిసేపటికి అందరు గురుబంధువులు సత్సంగానికి చేరుకున్నారు. అంతమంది కలసి త్వరగా చెన్నై నుండి శిరిడీ చేరడానికి ప్రత్యేక బస్సు తప్ప వేరే మార్గం లేకపోయింది. రెండు బస్సులు మాట్లాడుకొని మద్రాస్‌లోని గురుబంధువులందరం బయలుదేరాం. శనివారం రాత్రి 12 గం॥లకు బస్సులు బయలుదేరాయి. కానీ ఏ కారణం వల్లనో మేము శిరిడీ చేరేటప్పటికీ సోమవారం రాత్రి 8 గంటలు అయ్యింది. అందరికీ ఒళ్లు హూనం అయ్యింది. గురువుగారు మంగళవారం ఉదయం శిరిడీ చేరుకుంటారని మేము ప్రయాణంలో వున్నప్పుడు తెలిసింది. త్వరగా శిరిడీ చేరితే కనీసం బొంబాయి దాకా వెళ్లి చివరిసారి గురువుగారితో కలసి రావచ్చు కదా అన్న నా ఆలోచన విఫలమయింది. బస్సుదిగి సాయిపథం ప్రాంగణంకు వెళ్లగానే అక్కడ గురువుగారి సమాధి కార్యక్రమానికై గుంట తవ్వుతున్నారు. శనివారం రాత్రి నుండి నేను సరిగ్గా భోజనం చేయలేదు. అయినప్పటికీ ఆ సేవలో పాలుపంచుకోవాలని గుంటలో దిగి గడ్డపారతో రెండు పోట్లు వేసాను. నిస్సత్తువ ఆవరించింది. కళ్లు తిరగసాగాయి.





వెంటనే బయటకు వచ్చి హోటల్లో ఒక టీ త్రాగి మరలా తిరిగి వెళ్లాను. గురువుగారి మహిమను ఏమని కొనియాడేది? అప్పటి నుండి మరుసటి రోజు వుదయం 11 గంటలకు పని ఆపే వరకు నేను ఆ సేవలో నిమగ్నమయినాను. నాకు ఆకలిదప్పులు, కాలగమనం అసలు తెలియడం లేదు. నిస్సత్తువ ఎలా పోయిందో, అంత శ్రమ ఎలా చేయగలిగానో అంతా గురువుగారికే ఎరుక.

తరువాత నేను వెళ్లి స్నానం చేసి “బొంబాయి ఎటూ పోలేదు, కనీసం గురువుగారు వచ్చాక వారి చెంత కొంచెంసేపు కూర్చోవడానికి అవకాశం దొరుకుతుందో, లేదో” అని అనుకుంటూ సాయిపథం ప్రాంగణానికి వచ్చాను. గురువుగారి ఊరేగింపులో శిరిడీ పొలిమేర నుండి సాయిపథం ఆశ్రమం వరకు రావడానికి నియమించబడిన వాహనం ఆశ్రమం దగ్గర వుంది. ఆ వాహనంపై గురువుగారి, బాబా చిత్రపటాలను ఉంచి అలంకరిస్తున్నాను. ఇంతలో గురుబంధువు పూలప్రసాద్‌గారు కారులో వెళ్తూ, నన్ను పిలిచి తనతో రమ్మన్నారు. నేను నా స్నేహితులతో వస్తాను, మీరు వెళ్లండి అని చెప్పాను. కాదు, తనతో రమ్మని బలవంతం చేసారు, కారులో చోటులేదు కదా!, అని నేను నా స్నేహితులతోనే వస్తాను అని అన్నాను. ఎంత చెప్పినా వినకుండా ఆయన ఒళ్లో కూర్చోబెట్టుకొని బలవంతంగా కారులో తనతోనే తీసుకొని వెళ్లారు. కారులో పోతూ వున్నపుడు మనం శిరిడీ పొలిమేర దాటి వేరే చోటికి పోతున్నాం అని ఆయన అన్నారు. ఎక్కడికా అని నేను ఎదురుచూడసాగాను. ఆ తరువాత నాకు అర్థం అయ్యింది మేము గురువుగారు వస్తున్న వాహనానికి పూల అలంకరణ చేయడానికి వెళ్తున్నాం అని. శిరిడీ దాటి సుమారు 15 కి.మీ. ముందుకు వెళ్లాము. అక్కడ గురువుగారి వాహనం రోడ్డు ప్రక్కగా ఆపి వున్నది. అందరం కలసి ఆ వాహనానికి పూల అలంకరణ పూర్తి చేసాము. చివరలో వస్తూ, వస్తూ గురుదేవులకు నమస్కారం చేసుకుంటూ ఆయనను చూసాను. వారు ఎంతో ప్రశాంతంగా, హాయిగా నిద్రపోతున్నట్లు అనిపించింది నాకు.

అందరం కలసి అక్కడ నుండి శిరిడీ బయలుదేరుతుండగా, గురువుగారి పాదాల వద్ద గురుబంధువు గోపవరపు శివగారు కూర్చొని, అక్కడే నన్నూ కూర్చోమని సైగ చేసారు. నేను వెళ్లి గురువుగారి పాదాల వద్ద కూర్చున్నాను. గురువుగారి వాహనం బయలుదేరింది. గురుదేవుల ఆశీస్సులతో వారితో కలసి సుమారు 15 కి.మీ. ప్రయాణం చేసి శిరిడీ పొలిమేరలకు చేరుకున్నాను. అక్కడి నుండి వాహనం దిగి, అందరం కలసి గురువుగారితో ఊరేగింపుగా సాయిపథంకు వెళ్లాము. నేను గురువుగారితో బొంబాయి నుండి శిరిడీకి ప్రయాణం చేయాలని, వారి పాదాల చెంత కాసేపు కూర్చొవాలని అనుకున్న నా కోరికలను ఆయన ప్రేమతో తీర్చారు. అంత దుఃఖంలో కూడా నాపై గురువుగారి కరుణకు నేను మనసారా ఆయనకు కృతజ్ఞతాభివందనాలు తెలియచేసుకుంటున్నాను. మరలా ఆ మహాత్ముని మనకు ఇమ్మని వారితో అనుబంధాన్ని ఎప్పటికీ వుంచమని (ఇంకా పెంచమని) బాబాను ప్రార్థిస్తున్నాను.

**–రమేష్, చెన్నై**



శ్రీబాబూజీ మాటల్లో సాయి (తత్త్వం), ఆయన మౌనంలో సాయి (చింతన), ఆయన
స్మరణలో సాయి(నామం), ఆయన స్ఫురణలో సాయి (రూపం) ని అణువణువునా
నింపుకొని హృదయాన కొలువు తీర్చుకొని - ఆయన్నే సర్వస్వంగా చేసుకొని,
ఆయనపట్ల ఎనలేని అనన్య ప్రేమతో (అన్యమైన వాటితో పంచుకోలేని ప్రేమ) వారి ప్రతీ
స్పందనను సాయిలోలయింపచేసి, వారు వేసే ప్రతి అడుగూ శ్రీసాయి అనే గమ్యానికి
చేరువయ్యేందుకు దోహదంగా వారు చూపిన బాటే **"సాయిపథం"**.
శ్రీసాయి చెప్పిన మాటను మరువక, శ్రీసాయి చూపిన బాటను విడువక
శ్రీసాయి భాష్యాలకు, తాను 'భాష'గా, శ్రీసాయిచూపిన ఆదర్శాలను
ఆచరించడంలో రాజీలేని జీవన విధానాన్ని, మనిషి దైవంగా
మారగల సద్గురు పథమైన సాయిపథాన్ని చూపిన
ధీరోధాత్తులు, పురుషోత్తములు **శ్రీబాబూజీ**



శ్రీసాయి సుజ్ఞాన సారస్వానికి ప్రతీక

